నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 11 మార్చి 2024 | KARIMNAGAR

తిరిగి వచ్చేవారికి దర్వాజలు బంద్

పార్టీ ద్వారా లబ్ధి పొంది, అధికారం పోగానే పార్టీ మారిన నేతలు తిరిగి వస్తామంటే దర్వాజలు బందేనని కేటీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమేనని చెప్పారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలు, నాయకుల తీరుపై బీఆర్ఎస్ ఉద్యమకారుడు లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డి సభా వేదికగా కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన కేటీఆర్ కార్యకర్తలు నిరాశ చెందవద్దని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గ్రామాల వారీగా ముఖ్యనేతలతో తానే సమావేశమవుతానని చెప్పారు. కాంగ్రెస్ చేస్తున్న అబద్ధపు ప్రచారాలను ఇంటింటికీ వెళ్లి వివరించి, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అభ్యర్థించాలని కొత్తపల్లికి చెందిన సీనియర్ నాయకుడు గౌసొద్దీన్ సభా దృష్టికి తెచ్చారు.

చిత్తశుద్ధి ఉంటే బండి సంజయ్ చర్చకు రావాలి

మోదీ పదేళ్లు ప్రధానిగా కొనసాగితే వినోద్‌కుమార్ ఐదేళ్లు, బండి సంజయ్ ఐదేళ్లు ఎంపీలుగా పనిచేశారని, గంభీరావుపేట మండలాన్ని ఎవరి హయాంలో అభివృద్ధి చేశారో చర్చకు రావాలని కేటీఆర్ సవాల్ విసిరారు. ఎంపీగా ప్రజలకు అక్కరకు రాని సంజయ్ దక్షిణకాశీ అయిన వేములవాడకు ఎన్ని నిధులు మంజూరు చేయించారని ప్రశ్నించారు. పార్లమెంట్ సమావేశాల్లో హాజరు శాతం తక్కువ ఉన్న ఆయన ప్రజల పక్షాన ఎలా కొట్లాడుతాడని ప్రశ్నించారు. అందుకే ప్రజా సమస్యలపై అవగాహన ఉండి పార్లమెంట్‌లో గట్టిగా కొట్లాడే వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

గంభీరావుపేట బీఆర్ఎస్ మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు

కదనభేరిని సూపర్‌హిట్ చేద్దాం

- వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం
- సభకు గ్రామాల వారీగా తరలిరావాలి
- కేసీఆర్ సీఎంగా లేకుంటే చూడలేమని బాధ పడుతున్నరు
- మళ్లీ మనం అధికారంలోకి వస్తాం
- పార్టీ వదిలిన వారికి మళ్లీ దర్వాజలు తెరచేది లేదు
- కమీషన్ల కోసం కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి ఆపితే భరతం పడుతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఈ నెల 12న కరీంనగర్‌లో జరిగే కదనభేరికి పెద్ద సంఖ్యలో తరలివెళ్లి సూపర్‌హిట్ చేద్దామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి జైత్రయాత్ర ప్రారంభిస్తున్నదని, గట్టిగా కొట్లాడి కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని సూచించారు. ఆదివారం గంభీరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ మండలస్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

- సిరిసిల్ల/ గంభీరావుపేట, మార్చి 10

నిజం గడపదాటక ముందే అబద్ధం రాజ్యమేలింది

అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఎక్కడికి వెళ్లినా కార్యకర్తలు, ప్రజలు చాలా బాధతో ఉన్నారని, కేసీఆర్ సీఎంగా లేని తెలంగాణను చూడలేమని ఆవేదన చెందుతున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో నిజం గడప దాటక ముందే అబద్ధం రాజ్యమేలినట్లయిందని వివరించారు. ఆచరణకు నోచుకోని 420 హామీలను ఇచ్చి కాంగ్రెస్ గద్దెనెక్కిందని, అడ్డగోలుగా అబద్దాలు ప్రచారం చేసినా సిరిసిల్ల ప్రజలు, కార్యకర్తలు తనను గుండెల్లో పెట్టుకుని విజయాన్ని అందించారని గుర్తు చేశారు. గంభీరావుపేట మండలం తనకు 3800 మెజార్టీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తనకు మంచి మెజార్టీ ఇచ్చారని, లక్ష్మీపూర్ తండాలో దాదాపు 200 ఓట్లు ఉంటే తనకు 195 మంది ఓటేసినందుకు వారందరికీ రుణపడి ఉంటానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిజాయితీ గల మోసగాడని ఎద్దేవా చేశారు. ఎన్నికల హామీలో ప్రకటించిన రూ.2 లక్షల రుణ మాఫీ, పెంచుతామన్న రైతుబంధు ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వెళ్లే మొట్టమొదటి వ్యక్తి రేవంత్‌రెడ్డి అని, ఆయన మరో ఏక్‌నాథ్ షిండేనని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే పరోక్షంగా బీజేపీకి వేసినట్లు అవుతుందని, బీఆర్ఎస్‌కు వేసి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌కు గుదిబండగా మారాడని విమర్శించారు.

కరువు చాయలు వస్తున్నయ్..

ఇటీవల ముస్తాబాద్ పర్యటనలో రామలక్ష్మణపల్లికి చెందిన రైతులు నీటి కష్టాలపై విన్నవించారని గుర్తు చేశారు. ఎగువమానేరుపై నిర్మించిన 11 చెక్‌డ్యాంలలో నీటి నిలువలు తగ్గుతున్నాయని, భవిష్యత్తులో కరువుచాయలు కనిపిస్తున్నాయని రైతులు ఆవేదన చెందారని గుర్తుచేశారు. మానేరు నీటిని విడిచి చెక్‌డ్యాంలను నింపితే భూగర్భ జలాలు పెరుగుతాయని తనను కోరినట్లు వివరించారు. గతేడాది వానకాలం 14 శాతం అధిక వర్షపాతం నమోదైనా రేవంత్ సర్కార్ కావాలనే రైతులపై కక్షగట్టి బీఆర్ఎస్ ప్రభుత్వంపై మేడిగడ్డ అపవాదు మోపుతున్నారని మండిపడ్డారు. మూడు నెలలైనా మేడిగడ్డ మూడు పిల్లర్లను రిపేర్ చేయించే తెలివి లేని సీఎం రేవంత్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌పై కోపంతో రైతులకు నష్టం చేస్తున్నారని అన్నారు. తన పర్యటనలో రైతులంతా నీటి కోసం బాధపడుతున్నారని తెలిపారు.

గంభీరావుపేట సమగ్రాభివృద్ధి

కేసీఆర్ నాయకత్వంలో గంభీరావుపేట మండలం సమగ్రంగా అభివృద్ధి చెందిందని కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కేజీ టూ పీజీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల వాసుల చిరకాల కోరిక అయిన లింగన్నపేట-గంభీరావుపేట వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. గోదావరి జలాలను కూడవెళ్లి వాగు ద్వారా నింపి మండుటెండల్లో మత్తడి దూకించిన ఘనత కేసీఆర్‌కే చెల్లుతుందని చెప్పారు. ఎడారిలా మారిన ఎగువమానేరుకు జీవం పోసింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. అందుకే కేసీఆర్‌కు ఓటేయాలని కోరారు.

కమీషన్లకు కక్కుర్తి పడితే భరతం పడుతాం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను మంజూరు చేసిన అభివృద్ధి పనుల్లో కాంగ్రెస్ నేతలు కమీషన్లకు కక్కుర్తి పడి పనులు నిలిపేస్తే వారి భరతం పడుతామని కేటీఆర్ హెచ్చరించారు. గంభీరావుపేట-లింగన్నపేట వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనా పని నిలిచిపోయిందని, మండల కేంద్రంలో రోడ్ల విస్తరణ పనులు ఆగిపోయాయని వివరించారు.

సభను విఫలం చేసేందుకు సీఎం ప్రయత్నాలు

ఈ నెల 12న కరీంనగర్‌లో జరిగే కదనభేరి సభను సూపర్ హిట్ చేద్దామని కేటీఆర్ కోరారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలన్నారు. సభను విఫలం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని, కరీంనగర్ సభ రోజే హైదరాబాద్‌లో నిర్వహించే మహిళా సంఘాల సమావేశానికి బస్సుల్లో మహిళలను తరలిస్తున్నారని పేర్కొన్నారు. అయినా, మనకు ప్రైవేటు బస్సులు లభించాయని, గ్రామాల వారీగా విభజించుకొని అత్యధిక సంఖ్యలో సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాజీ బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర డైరెక్టర్ సుమలతా శర్మ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, దరువు ఎల్లన్న, ఎంపీపీ కరుణ, జడ్పీటీసీ విజయలక్ష్మి, సెస్‌డైరెక్టర్ నారాయణరావు, జడ్పీ కోఆప్షన్ హైమద్, నేతలు కొమిరిశెట్టి లక్ష్మణ్, వంగ సురేందర్‌రెడ్డి, లింగన్నగారి దయాకర్‌రావు, కమ్మరి రాజారాం, గోగు లింగంయాదవ్, ధ్యానబోయిన రాజేందర్, గంధ్యాడపు రాజు, ఎర్ర రామాంజనేయగౌడ్, లతా రెడ్డి, హన్మంతరెడ్డి, వెంకట్‌యాదవ్, కమలాకర్‌రెడ్డి, చెవుల మల్లేశం, సింగారపు నాగరాజుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, సుధాకర్‌శర్మ, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజేందర్ పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన నాయకులు

ప్రజల పక్షాన ఉండేది బీఆర్ఎస్

2001 నుంచి నేటి వరకు ప్రజల పక్షాన నిలిచింది, అన్నింటా అండగా ఉన్నది బీఆర్ఎస్ పార్టీ ఒక్కటే. ఎవరు అధికారంలో ఉన్నా మనల్ని ఏమీ చేయలేరు. మీకు కేసీఆర్, కేటీఆర్‌తో పాటు గులాబీ సైన్యం వెన్నంటి ఉన్నది. ప్రజా సమస్యలపై ఏ మాత్రం అవగాహన లేని పార్టీల తరపున అభ్యర్థులు వచ్చి పోటీ చేస్తున్నరు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంటే మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పార్లమెంట్‌లో గళమెత్తి ఎన్ని నిధులు తెచ్చి అభివృద్ధి చేశారో..? గుర్తించాలి. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా ఎంపీ బండి సంజయ్ నిధులు ఎందుకు తేలేదు. అందరూ ఒకసారి ఆలోచించాలి. వినోద్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం.

- కొండూరి రవీందర్‌రావు, నాఫ్స్‌కాబ్ చైర్మన్

పదేళ్ల పాలనను ప్రజలకు వివరిద్దాం..



తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలో గత పదేళ్లలో అన్నింటా జరిగిన అభివృద్ధిని ఒకసారి ప్రజలకు వివరిస్తూ కరీనంగర్ ఎంపీగా బీ వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. కేటీఆర్ సహకారంతో సిరిసిల్ల నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేసుకున్నాం. మెరుగైన విద్య, వైద్య, సాగు నీరు, రోడ్లు తదితర వసతులపై ప్రజలకు ఒకసారి గుర్తు చేద్దాం. కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దెర హామీలను నమ్మవద్దు. రైతుబంధు, రుణ మాఫీ, కల్యాణ లక్ష్మి తదితర నగదు పథకాల హామీలు అమలు చేయకపోవడంపై నిలదీద్దాం. గతంలో కరీంనగర్ పార్లమెంటు పరిధిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన వినోద్‌కుమార్ విజయానికి పట్టం కడుదాం.

- న్యాలకొండ అరుణ, జడ్పీ చైర్‌పర్సన్. రాజన్న సిరిసిల్ల

ఐక్యతతో అత్యధిక మెజార్టీ అందిద్దాం

రాష్ట్ర సాధనలో ముందున్న, కీలకంగా వ్యవహరించిన వినోద్‌కుమార్‌ను ఎంపీగా అందరం ఒక్కటై భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. రాష్ట్ర సమస్యలపై అవగాహన ఉండి గతంలో ఎంపీగా పార్లమెంటులో అత్యధిక ప్రశ్నలు అడిగిన మన నాయకులు వినోద్‌కుమార్. కేటీఆర్ సారథ్యంలో సిరిసిల్ల నియోజకవర్గం నుంచి వినోద్‌కుమార్‌కు భారీ మెజార్టీ అందిద్దాం. సక్సెస్ అనేది ఇక్కడి నుంచే చూపిద్దాం.

- తోట ఆగయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

ప్రగతిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలి..

గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గతంలో ఎంపీగా వినోద్‌కుమార్ చేసిన ప్రగతిని వివరిస్తూ ఓట్లను అభ్యర్థించాలి. ఎంపీ వినోద్‌కుమార్ గెలిస్తే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. సిరిసిల్ల ఎమ్మెల్యే మన కేటీఆర్. అలాగే ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించుకున్నట్లయితే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది.

- చిక్కాల రామారావు, సెస్ చైర్మన్, సిరిసిల్ల

కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లే..

- మేడిగడ్డ మరమ్మతులపై ఊసే లేదు
- మళ్లీ కరెంటు, నీటి కష్టాలు
- కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- కరెంట్ షాక్ గురైన బాధితులకు పరామర్శ

వేములవాడ ఏరియా దవాఖానలో బాధితుడిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

కోనరావుపేట, మార్చి 10 : కాంగ్రెస్ పభుత్వంలో రైతులకు నీళ్లు, కరెంటు కష్టాలు మళ్లీ మొదలయ్యాయని, వారికి కన్నీళ్లే మిగులుతున్నాయని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని బావుసాయిపేటకు చెందిన కూలీలు విద్యుత్ షాక్ గురై వేములవాడ ఏరియా దవాఖానలో చికిత్స పొందుతుండగా వారిని పరామర్శించడంతో పాటు, సిరిసిల్లలో భూమయ్య మృత దేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయంలో పదేండ్లు రైతులు ఎలాంటి కష్టాలూ లేకుండా సంతోషంగా పంటలను పండించుకున్నారని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూణ్నెళ్లలోనే ఎంతో మంది రైతులు కరెంటు, నీళ్లు లేక అరిగోస పడుతున్నారన్నారు. దీంతో మళ్లీ కరెంటు బావుల వద్ద విద్యుత్ షాక్‌లతో రైతులు మృతిచెందుతున్నారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి బీఆర్ఎస్‌పై నిందలు వేస్తూ కాలాయాపన చేయడం తప్ప మరొకటి లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేసీఆర్ రైతులకు నీళ్లందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. మేడిగడ్డ బరాజ్ పిల్లర్ల మరమ్మతులపై ఊసెత్తడం లేదని మండిపడ్డారు. దీంతో రైతులకు సాగునీరందక కన్నీళ్లు పెట్టుకుంటున్నారని గుర్తుచేశారు. పంట కాపు దశకు వచ్చి పూర్తిగా ఎండిపోవడంతో పశువులను మేపుతున్నారని చెప్పారు. చెరువులు, కుంటల్లో నీళ్లు లేక బోర్లు, బావులు అడుగంటి పోతున్నాయన్నారు. దీంతో రైతులు నీళ్ల కోసం వెళ్లి కరెంటు షాక్‌లకు బలవుతున్నారని చెప్పారు. మృతుడు భూమయ్య కుటుంబ సభ్యులకు తక్షణ సాయం కింద రూ.5లక్షలు ఇవ్వాలని, సెస్ సంస్థ ద్వారా ఆదుకోవాలని కోరారు. వారి కుటుంబ సభ్యులకు తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సింగిల్ విండో చైర్మన్ నర్సయ్య, సెస్ వైస్ చైర్మన్ దేరవకొండ తిరుపతి, నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, రామతీర్థపు రాజు ఉన్నారు.

సభకు తరలిరండి

- బీఆర్ఎస్‌వీ, బీఆర్ఎస్‌వై నాయకుల డప్పు చాటింపు

కదనభేరికి తరలిరావాలంటూ డప్పు చాటింపు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 10 : కరీంనగర్‌లో ఈనెల 12న నిర్వహించే కరీంనగర్ కదనభేరికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరుతూ ఆదివారం బీఆర్ఎస్‌వీ, బీఆర్ఎస్‌వై నాయకులు నగరంలో డప్పు చాటింపు చేశారు. స్థానిక తెలంగాణ చౌక్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరీంనగర్ నుంచి ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఈ ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.ఐదు పైసల బిల్ల తీసుకురాలేదని మండిపడ్డారు. గతంలో ఎంపీగా పని చేసిన వినోద్‌కుమార్ కరీంనగర్‌ను స్మార్ట్ సిటీలో చేర్చడంతోపాటు, జాతీయ రహదారులు, రైల్వే లైన్లు తీసుకువచ్చారని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పని చేసే వినోద్‌కుమార్‌ను ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్, జక్కుల నాగరాజు, భూక్య తిరుపతినాయక్, శ్రీనాథ్ గౌడ్, మధుసూదన్, కెమసారం తిరుపతి, దూలం సంపత్‌గౌడ్, వెంకట్, హరీశ్, పర్శరాం, రవినాయక్, రాజు, సత్తినేని శ్రీనివాస్, అజయ్, మహేందర్, రాజశేఖర్, వేణు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గౌడ కులస్తులకు అండగా ఉంటా

ఆత్మీయ సన్మానంలో మంత్రి పొన్నం ప్రభాకర్

కమాన్‌చౌరస్తా, మార్చి 10 : గౌడ కులస్తుల సహకారంతోనే తాను ఈ స్థాయికి వచ్చానని, తన వంతు సహకారం అందించి అండగా ఉంటానని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వీ కన్వెన్షన్‌లో ఉమ్మడి జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయనకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తనకు మద్దతుగా ఉన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు మంత్రిని గౌడ సంఘాల బాటధ్యులు బైపాస్ వద్ద ఘన స్వాగతం పలికారు. ఆదర్శ సంస్థల ఎండీ బూరుగు సత్యనారాయణగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రాజేశం గౌడ్, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణ గౌడ్, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పల్లె లక్ష్మణ్ గౌడ్, రాచకొండ తిరుపతి గౌడ్, రిటైర్డ్ డీసీపీ సుదర్శన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అల్ఫోర్స్‌లో 'మౌక్తికం' అదుర్స్

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ టైని టాట్స్ హైస్కూల్‌లో ఆదివారం 'మౌక్తికం' పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు అలరించాయి. ఈ వేడుకలను పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కళలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు వాటిలో పాల్గొనాలని, తద్వారా సమాజంలో సముచిత గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- కమాన్‌చౌరస్తా, మార్చి 10

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు

- వాళ్లకు అధికార యావ తప్ప రైతులపై ప్రేమ లేదు
- నీళ్లడిగితే కేసులు పెడతామంటారా..? ఎంత ధైర్యం..? • నీరందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతులే ఉద్యమిస్తరు • మాజీ మంత్రి, పెద్దపల్లి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, మార్చి 10: 'కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడు నెలలు కూడా కాలేదు. అప్పుడే రైతన్నలను అరిగోసపెడుతున్నరు. సాగుకు నీరందించకుండా పంటలు ఎండబెడుతున్నరు. ఇది కాంగ్రెస్ తెచ్చి కరువు. వాళ్లకు అధికార యావ తప్ప రైతులపై ప్రేమ లేదని' మాజీ మంత్రి, పెద్దపల్లి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. ఎండపెల్లి మండలం మారేడుపల్లి, ముంజంపల్లి గ్రామాల్లో 'ఎండుతున్న పంటలు' అనే శీర్షికతో నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనాన్ని చూసి చలించిపోయారు. ఆదివారం జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, స్థానిక రైతులతో కలిసి ఆయా గ్రామాలకు వెళ్లి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కొప్పుల వద్దకు వచ్చి పంట పొలాలను చూపించుకుంటూ గోడు వెల్లబోసుకున్నారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే మాకు మంచిగుందని, కేసీఆర్ సార్, మీరు పదవిలో ఉన్నప్పుడు మాకు ఏ రంది లేదని, పంటలకు పుష్కలంగా నీరందించి కాపాడారని గుర్తుచేసుకున్నారు. కానీ, ఇప్పుడు అధికారంలో ఉన్న నాయకులకు చెప్పుకుంటే పట్టించుకోవడం లేదని, మీరే దిక్కంటూ..? కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ 500 ఏండ్లలో సగటున కురియనంత వర్షం గతేడాది తెలంగాణలో కురిసిందని, ఎటు చూసినా నీళ్లు కనిపించాయని, ఇప్పుడు ఎటు చూసినా నీళ్లు లేక నెర్రెలు తెరిచిన పొలాలు కనిపిస్తున్నాయన్నారు. నీటిని ఒడిసిపట్టి, పొలాలను తడపాలన్న విషయాన్ని కాంగ్రెస్ ఆలోచించకపోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందన్నారు. ఎస్సారెస్పీ పంప్ హౌస్ ద్వారా నీళ్లు వస్తాయని గంపెడాశలతో దాదాపు 820 మంది రైతులు ముంజంపల్లి, మారేడుపల్లి గ్రామ పరిధిలో 1800 ఎకరాల్లో వరి సాగు చేశారన్నారు. పొట్ట దశలో సాగు నీరందకపోవడంతో పొలాలన్నీ ఎండిపోయాయన్నారు. ఇప్పటికే 100 మంది రైతులకు చెందిన 300 ఎకరాల వరి పనికిరాకుండా పోయిందన్నారు. నీళ్లడిగితే కేసులు పెడతామంటారా? ఎంత ధైర్యమని ధ్వజమెత్తారు. రైతులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే వేంనూర్ పంప్‌హౌస్ నుంచి నీటిని విడుదల చేయాలని, నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే రైతు ఉద్యమం ప్రారంభమవుతుందని హెచ్చరించారు. జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ పంట పొలాల్లో ఉండాల్సిన నీరు రైతు కండ్లల్లో తిరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు.

ఏడెకరాలకు ఎకరంన్నర మక్క వేసినా నీరందుతలేదు..

నాకు ముంజంపల్లిలో ఏడెకరాల భూమి ఉంది. ఎప్పుడూ మొత్తం భూమిల పంట వేస్త. కానీ నీళ్ల మీద నమ్మకం లేక ఈ యాసంగిల ఎకరంన్నరల మక్కపెట్టిన. మిగిలినది బీడుపెట్టిన. ఏసిన కొద్ది మక్కకు కూడా బావిలో నీళ్లు ఎల్లుతలేవు. కనీసం పశువులకు తాగడానికి నీళ్లు పెట్టే పరిస్థితి లేదు. వెంటనే వేంనూర్ పంప్‌హౌస్ నుంచి నీటిని విడుదల చేయకపోతే ఉన్న పంటలన్నీ ఎండుతయి.

- పంబిల్ల రాజేందర్‌రెడ్డి, రైతు, ముంజంపల్లి.

మారేడుపల్లి శివారులో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, దావ వసంత.

మూడెకరాల పంట ఎండిపోయింది..

మాది మారేడుపల్లి. ఊళ్లే నాకు మూడెకరాల భూమి ఉంది. మొత్తం వరి పెట్టిన. బావిలో నీరు అడుగంటిపోయింది. కాలువ నీళ్లు వస్తయనుకుంటే చుక్క కూడా రాలే. వేసుకున్న పంట మొత్తం ఎండిపోయింది. పదేండ్లల్లో ఇలాంటి కరువు ఏనాడూ చూడలే. ఈ యేడు రైతు బంధు కూడా రాలె. ప్రభుత్వం ఆదుకోవాలి. **- బేతు మల్లేశం రైతు, మారేడుపల్లి.**